నోటు పుస్తకాల పంపిణీ

పమిడిముక్కల: కృష్ణాపురం కొత్త ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యలమర్రు హైస్కూల్ హెచ్ఎం ఆర్.వరుణ్‌కుమార్ నోటు పుస్తకాలు ఆదివారం అందజేశారు. ఎస్సీ కాలనీకి చెందిన పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ చేశారు. బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కొండవీటి బాబు, కొండవీటి యోబు, కాటూరి ఏసుపాదం పాల్గొన్నారు.

రూ.10 కోట్లతో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం

ఎంపీ బాలశౌరి



కమ్యూనిటీ హాలు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే నాని

గుడివాడ టౌన్: బందరు పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రజల అవసరాల మేరకు రూ.10 కోట్లతో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి రంగం సిద్ధం చేశామని బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి తెలిపారు. ఆదివారం స్థానిక పెద ఎరికపాడులోని మున్సిపల్ ఖాళీస్థలంలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నానితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూరల్ ఎలక్ట్రికల్ కార్పొరేషన్ (ఆర్ఈసీ) వారు సీఎస్ఆర్ ఫండ్స్ కింద బందరు పార్లమెంట్ నియోజకవర్గానికి రూ.5 కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు. అందులో ఒక కోటి రూపాయలు నిధులు ఇక్కడి ప్రజలు, స్థానిక ఎమ్మెల్యే కొడాలి నాని అభ్యర్థన మేరకు మల్టీపర్పస్ కమ్యూనిటీ హాలు నిర్మిస్తున్నామని తెలిపారు. మొత్తం 90 అడుగుల పొడవు, 50 అడుగుల వెడల్పుతో ఈ హాలు నిర్మాణం జరుగుతుందని అన్నారు. అవసరాన్ని బట్టి మరో ఫ్లోర్ ఏర్పాటు చేసి పైన వివాహాలు, కింద భోజన కార్యక్రమాలకు అనుకూలంగా తీర్చిదిద్దుతామన్నారు. అవసరమైతే మరిన్ని నిధులు సమకూర్చే బాధ్యతను తాను తీసుకుంటానన్నారు. గన్నవరం నియోజకవర్గం బాపులపాడు కేంద్రంగా రూ.50 లక్షల నిధులతో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఏర్పాట్లు సిద్ధం చేశామని, దానికి దివంగత నాయకుడు వంగవీటి మోహన్‌రంగా పేరు పెడతామని తెలిపారు. రూ.60 లక్షలతో ఎదురుమొండి గ్రామంలో మరో కమ్యూనిటీ హాలు నిర్మిస్తామన్నారు. రానున్న రెండుమూడు నెలల్లో ఎక్కడ కమ్యూనిటీ హాలు అవసరమైతే అక్కడ నిర్మాణం చేపడతామని వివరించారు.

ఎమ్మెల్యే కొడాలి నాని నూతన సంవత్సర శుభాకాంక్షలు



గుడివాడ టౌన్: గుడివాడ నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2024 సంవత్సరంలో ప్రజలంతా ఆనందోత్సాహాలతో ఆరోగ్యంగా ఉండాలని, వారి అందరి కోర్కెలు ఫలించాలని భగవంతుని కోరుతున్నానన్నారు. ఈ ఏడాది రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రిగా ప్రజలకు మంచి పాలన అందించాలని కోరుకుంటున్నానన్నారు.

ముగిసిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు



విజేతలైన క్రీడాకారులతో నిర్వాహకులు

గుడివాడ టౌన్: ఏజీకే హైస్కూల్ షటిల్ కోర్టు 7వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. డిసెంబర్ 22న ఈ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో ఏ-పూల్ నుంచి 5 జట్లు, బీ-పూల్ నుంచి 9 జట్లు పాల్గొనగా ఏ-పూల్ నుంచి శ్రీకర్, జోసఫ్ టీమ్‌లు విన్నర్లుగా, సతీష్, మధు టీమ్‌లు రన్నర్లుగా నిలిచారు. బీ-పూల్‌లో అమ్మన్నబాబు, కేఎల్ శ్రీనాథ్ విన్నర్లుగా, సుధాకర్, శ్రీను టీమ్ రన్నర్లుగా నిలిచారని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీలకు రిఫరీలుగా వ్యాయామ ఉపాధ్యాయులు భాస్కర్, సతీష్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ కృష్ణాజిల్లా గౌరవ అధ్యక్షుడు నీలం ప్రభాకర్, ఈడే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వణుదుర్రులో చీరల పంపిణీ



వణుదుర్రులో వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ముదినేపల్లి రూరల్: వణుదుర్రులో వృద్ధులకు ఆదివారం చీరలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ ఈవో పీఆర్డీ ఈదా బైరాగి నూతన సంవత్సరం సందర్భంగా 150 మంది వృద్ధులకు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా బైరాగి మాట్లాడుతూ గత ఎనిమిదేళ్లుగా గ్రామంలోని వృద్ధులకు ఈ విధంగా చీరలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. నూతన సంవత్సరంలో వీరంతా ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు లేళ్ళ ఆంజనేయులు, ఈదా బాయమ్మ, విజయకుమారి, చంద్రలీల, ఐజాక్ రాజు, రెడ్డమ్మ పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న గంగాధరరావు

పమిడిముక్కల: లయన్స్ క్లబ్ ఆఫ్ కపిలేశ్వరపురం ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలోని వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఇంటర్నేషనల్ లయన్స్ వ్యవస్థాపకుడు ఎల్విన్ జోన్స్ జయంతి సందర్భంగా ప్రవాసాంధ్రురాలు డాక్టర్ మాధవి వితరణతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు లయన్స్ ట్రెజరర్ చిగురుపాటి జగదీష్ తెలిపారు. త్వరలో గ్రామంలో ఏకాత్మ గోశాల అనే పేరుతో సేవా సంస్థను ఏర్పాటు చేస్తున్నట్లు కార్యదర్శి తుమ్మల గంగాధరరావు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కడియాల ప్రకాశరావు, తుమ్మల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నగర సంకీర్తన

మండవల్లి: మండవల్లి షిర్డీ సాయిబాబా భక్త సమాజం ధనుర్మాసం, పురస్కరించుకుని నిర్వహిస్తున్న నగర సంకీర్తన కార్యక్రమం భక్తులను ఆకుట్టుకుంటుంది. గన్నవరంలో ఆదివారం ఉదయం 5 గంటల నుంచి నగర సంకీర్తన నిర్వహించారు. వేకువజామునే గ్రామానికి చెందిన గృహస్తులను సాయినామ సంకీర్తనతో మేల్కొలిపారు. ఒక భక్తుడికి బాబా మాదిరిగా జోలి వేస్తారు. భక్తులు జోలెలో బియ్యం పోస్తారు. వాహనంపై ఉన్న బాబా విగ్రహానికి పూజలు నిర్వహించి బియ్యం, నగదు సమర్పించి స్వామివారిని కొలుస్తారు. ఆలయ నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు, యిన్నా వెంకటేశ్వరరావు, పెరుమాళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.


సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధిచెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని అధిక సంఖ్యలో భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. స్వామివారి పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. పాల పొంగళ్ల శాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారు చేసి స్వామికి సమర్పించారు. గోకులంలోని గోవులకు, నాగబంధాల వద్ద పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య పర్యవేక్షించారు.













అడపా బాజ్జీ చిరస్మరణీయుడు

బాజ్జీ చిల్డ్రన్స్ పార్కు ప్రారంభ కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యే



పార్కును ప్రారంభిస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్: ఆప్తమిత్రుడు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అడపా బాజ్జీ చిరస్మరణీయుడని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అన్నారు. ఆదివారం స్థానిక పెద ఎరికపాడులో 15వ ఆర్థిక సంఘం, మున్సిపల్ సాధారణ నిధులు రూ.15 లక్షలతో నిర్మించిన అడపా బాజ్జీ చిల్డ్రన్స్ పార్కును ఆయన బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎరికపాడు ప్రజలకు ఆదర్శంగా, అండగా నిలుస్తూ రెండు తరాలుగా అడపా బాజ్జీ కుటుంబం పనిచేసిందన్నారు. ఆయన అకాల మరణం కుటుంబానికి తీరని లోటని బాజ్జీ జ్ఞాపకార్థం ఈ పార్కును నిర్మించామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, పాలేటి చంటి, అడపా పండు, అలంకార్ శేఖర్, అడబాల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.









'మానవత' డైరెక్టరీ ఆవిష్కరణ



మానవత డైరెక్టరీని ఆవిష్కరిస్తున్న ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

పామర్రు: నూతన సంవత్సరంలో ప్రజలు సుఖ శాంతులతో సంతోషాలతో ఉండాలని పామర్రు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి అన్నారు. పామర్రు మానవత సేవ సంస్థ సమావేశం ఆదివారం నిర్వహించారు. మానవత సేవా సంస్థ రూపొందించిన పుస్తకాన్ని (డైరెక్టరీ)ని ఆవిష్కరించారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో సేవా సంస్థలు భాగస్వాములు కావాలని అన్నారు. పామర్రు మానవత సేవా సంస్థ అధ్యక్షుడు ఐవీఎస్ మనోహరరావు అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో జిల్లా కార్యదర్శి శీతాల ప్రసాద్, రీజియన్ చైర్మన్ పీఎంఎస్ ప్రసాద్, కార్యదర్శి పామర్తి వెంకట నారాయణ, కోశాధికారి పీబీ శ్రీనివాస్, కన్వీనర్ ఎన్.త్రివిక్రమరావు, డైరెక్టర్లు అల్లాడ సోమ శేఖరరావు, రవీంద్ర, మండపాక సుబ్బారావు, రెడ్రౌతు నరసింహారావు, వేణు, తాడిశెట్టి సాయిబాబు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చెరకులోడు ట్రాక్టర్ పల్టీ



తోట్లవల్లూరు: చెరకులోడు ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిన ఘటన తోట్లవల్లూరు సమీపంలో జరిగింది. తోట్లవల్లూరు వైపు నుంచి ఉయ్యూరు కేసీపీ చక్కెర కర్మాగారానికి చెరకు లోడుతో వెళుతున్న ట్రాక్టర్ ఆదివారం సాయంత్రం బందరు కాలువ వంతెన దిగే క్రమంలో ప్రమాదవశాత్తు పల్టీ కొట్టింది. దీంతో ఉయ్యూరు-తోట్లవల్లూరు మధ్య వాహనాల రాకపోకలకు కొద్ది సేపు అంతరాయం కలిగింది. అధిక లోడుతో చెరకును ట్రాక్టర్లు రవాణ చేయటం వలనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు అంటున్నారు. రవాణ, పోలీసు స్పందించాలని కోరుతున్నారు.





















మహిళల హక్కుల సాధనకు కృషి చేయాలి

ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: సమాజంలో మహిళల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. వరల్డ్ కౌన్సిల్ ఫర్ ఉమెన్ రైట్స్ (డబ్ల్యూసీడబ్ల్యూఆర్) ఏలూరు జిల్లా అధ్యక్షురాలు దోమతోటి సలోమి అధ్వర్యంలో ఆటపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహిళా హక్కుల అవగాహన సదస్సు, మహిళలకు వివిధ పోటీలను ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నారన్నారు. ఎంపీపీ అడవి కృష్ణ మాట్లాడుతూ మహిళలకు పోటీలు నిర్వహించడాన్ని అభినందించారు. డాక్టరు డి.ప్రశాంతి మహిళల ఆరోగ్యంపై, న్యాయవాది బి.ఇందిర మహిళల హక్కుల చట్టాలను వివరించారు. అధ్యక్షురాలు సలోమి మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా ముందుగా తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. కైకలూరు కూచిపూడి నాట్య రవళి కళాకారులు అభినయించిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ఆటపాక గ్రామ ప్రముఖుడు తలారి జాన్, ఉపాధ్యాయులు బొర్రా శ్యామ్‌సుందర్, న్యాయవాది శ్రీనివాసరావు, సామాజిక సేవా కార్యకర్త కల్యాణి, పీడీ లూయిస్ పాల్గొన్నారు.



కైకలూరు హైస్కూల్లో మహిళలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

విజేతలు వీరే..

లెమన్ అండ్ స్పూన్ ఆటలో ఎస్.నీలిమా, ఎస్‌కే.రెహనా, ఏ.అంకిత, బెలూన్ రేస్‌లో దేవి, జె.శశికళ, శివశ్రీలక్ష్మి, మ్యూజికల్స్ చైర్స్ ఆటలో లక్ష్మి, పర్వీన్, లావణ్య ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. కుక్కర్, హాట్ బాక్స్ వంటి బహమతులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందుకున్నారు.

తాడంకి హైస్కూల్‌కు మహర్దశ



తాడంకి హైస్కూల్


నాడు-నేడులో మరమ్మతులు చేసిన తాడంకి హైస్కూల్ తరగతి గదులు

- నాడు-నేడు నిధులు రూ.1.25 కోట్లతో అభివృద్ధి
- వందేళ్ల చరిత్ర కలిగిన హైస్కూల్‌కు నూతన హంగులు

పమిడిముక్కల: పేదల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. విద్యకు పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేస్తోంది. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతోంది. రూ.1.25 కోట్ల నాడు-నేడు నిధులతో తాడంకి హైస్కూల్‌ను సుందరంగా తీర్చిదిద్దడం ఇందుకు ఒక ఉదాహరణ.

గత పరిస్థితి ఇదీ..

తాడంకి హైస్కూల్‌కు వందేళ్ల చరిత్ర ఉంది. ఈ పాఠశాలలో 482 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మంటాడ, తాడంకి, మంత్రివాడ, గోపువానిపాలెం, గురజాడ, సాయిపురం గ్రామాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. పెంకుటిల్లు పూర్తిగా దెబ్బతినడం, భవనాలు శిథిలావస్థకు చేరడంతో వర్షం పడితే నీరు కారడం, పెచ్చూలూడి పడటం జరిగేది. వర్షం పడితే పాఠశాల ఆవరణ, ఆట స్థలం జలమయంగా మారేది. విద్యార్థులు, ఉపాధ్యాయులు తరగతి గదుల్లో బిక్కుబిక్కుమంటూ కాలం గడిపేవారు.

రూ.1.25 కోట్లతో..

ఈ పాఠశాలకు నాడు-నేడు మొదటి, రెండో విడత కింద రూ.1.25 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో పెంకుటిల్లు, భవనాలకు మరమ్మతులు చేపట్టారు. అదనపు తరగతి గదులు నిర్మించారు. తరగతి గదుల్లో ఫ్యాన్లు, బెంచీలు సమకూర్చారు. అవసరమైన మేర మరుగుదొడ్లు నిర్మించారు. ఉపాధి నిధులు రూ.5 లక్షలతో ప్రహరీ నిర్మించారు. దతల సహకారం రూ.5 లక్షలతో ఆటస్థలాన్ని అభివృద్ధి చేశారు. పూర్వ విద్యార్థులు సమకూర్చిన రూ.2 లక్షలతో పాఠశాల ఆవరణను మెరక చేశారు. హైస్కూల్‌ను సుందరంగా తీర్చిదిద్దారు.

సీఎంకు కృతజ్ఞతలు..



గతంలో హైస్కూల్లో సరైన సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. నాడు-నేడు పథకం కింద అవసరమైన సౌకర్యాలు కల్పించారు. పేద పిల్లలు చదువుకొనే పాఠశాలను కార్పొరేట్ స్థాయికి తీర్చిదిద్దారు. విద్యార్థులు, తల్లిదండ్రుల తరపున సీఎం జగన్‌కు కృతజ్ఞతలు. తాగునీటి కోసం బోర్‌వెల్ వేయాలని, ప్రహరీ నిర్మాణం చేయాలని కోరుతున్నాను.

-కంభపు రాంబాబు, పేరెంట్స్ కమిటీ చైర్మన్

దాతల సహకారం..



పార్క్ అభివృద్ధికి, ఆటస్థలం మెరకకు దాతలు సహకారం అందించాలి. ఆటస్థలంలో మురుగు బయటకు పోయే ఏర్పాటు చేయాలి. విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వానికి, హైస్కూల్ అభివృద్ధికి పాటుపడుతున్న పేరెంట్స్ కమిటీ, జెడ్పీటీసీ సభ్యురాలు యేనుగ వెంకట రమణకుమారి, సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, దాతలు, గ్రామస్తులకు కృతజ్ఞతలు.

-ప్రసాద్, హెచ్‌ఎం, తాడంకి

విశ్వ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో ముందుండాలి

ఎమ్మెల్యే డీఎన్నార్


విశ్వబ్రాహ్మణుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: విశ్వబ్రాహ్మణులు అన్ని రంగాల్లో ముందుండాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. కై కలూరులో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో విశ్వ బ్రాహ్మణుల సంఘం నూతన కార్యవర్గ ఎంపిక కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదివారం పాల్గొన్నారు. అధ్యక్షుడిగా టేకు వెంకట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా సింహాద్రి రాంబాబు, ఇతర కార్యవర్గం ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు దేవాలయ నిర్వాహణ బాధ్యతలు చేపట్టిన సింహాద్రి రామకృష్ణ వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ అభరణాలు, మూలధనం లెక్కలను నూతన కమిటీకి అప్పగించారు. ఈ కార్యక్రమంలో టేకు జయచారి, పేరేపి వీరభద్రాచారి, న్యాయవాది ఆత్రేయబాబు, నూతన ఆలయ చైర్మన్ టేకి వెంకట సత్యనారాయణ, నాయకులు తుపాకుల సోమాచారి, అనుపోజు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఐదు సిమెంట్ బల్లలు వితరణ



అవనిగడ్డ: అవనిగడ్డలో పలు ప్రాంతాల్లో శ్రీరామావెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిశోర్‌నాయుడు రూ.20వేలు విలువగల ఐదు సిమెంట్ బల్లలను వితరణ ఇచ్చారు. తన తండ్రి తోట చక్రపాణి జ్ఞాపకార్థం స్థానిక వంతెన సెంటర్, పెట్రోల్ బంక్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానం ప్రాంతంలో వీటిని ఆదివారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తోట శ్యాంకృష్ణ, గుడివాక శేషుబాబు, యలవర్తి నాంచారయ్య, మోపిదేవి కోటేశ్వరరావు, బచ్చు ఆదినారాయణ, కర్రా ఆదిశేషు పాల్గొన్నారు.

బందరు డీఎస్పీ బదిలీ

కోనేరుసెంటర్: బందరు డీఎస్పీ వై. మాధవరెడ్డి బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర డిజిపి ఉత్తర్వులు జారీ చేశారు. బందరు డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న మాధవరెడ్డిని సీఎం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్గా బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. డీజీపీ ఉత్తర్వుల మేరకు మాధవరెడ్డి బందరు డీఎస్పీగా రిలీవ్ కాగా ఆయన స్థానంలో దిశా డీఎస్పీ యు. నాగరాజును బందరు ఇన్‌చార్జ్ డీఎస్పీగా నియమిస్తూ జిల్లా ఎస్పీ పి. జాషువా ఉత్తర్వులు జారీ చేశారు.

సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభం

కోడూరు: మండలంలోని విశ్వనాథపల్లి గ్రామంలో నూతన సీసీ రహదారి నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. గ్రామంలోని శివాలయానికి వెళ్లే రహదారికి అధ్వానంగా ఉండడంతో గ్రామస్తుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎస్ఆర్ఈజీఎస్ ద్వారా కేటాయించిన రూ.5.80లక్షల నిధులతో 244 మీటర్ల మేర నూతన సీసీ రోడ్డును నిర్మించేందుకు పనులకు శ్రీకారం చుట్టారు. ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి ఈ పనులను ప్రారంభించారు. రహదారి నిర్మాణంలో నాణ్యత పాటించాలని ఎంపీపీ సూచించారు. వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, సర్పంచి కొప్పనాతి శేషుబాబు, గ్రామ కన్వీనర్ తోట దుర్గారావు, ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి తండు రమేష్, నేతలు కొప్పనాతి నాంచారయ్య, ధూళిపూడి వెంకటేశ్వరరావు, తండు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

కైకలూరు: ఇంటి నుంచి బయటకు వెళ్లిన భర్త కనిపిండం లేదంటూ భార్య రూరల్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. వరహాపట్నం గ్రామానికి చెందిన జువ్వాజీ నాగేంద్రబాబు తామరకొల్లులో మెడికల్ దుకాణం నడుపుతున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. డిసెంబర్ 22వ తేదీ నుంచి అతను కనిపించడం లేదని, బంధువుల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో భార్య కోమలదేవి రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూరల్ ఎస్ఐ జ్యోతిబసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా గంగానమ్మ జాతర

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులో శ్రీ గంగానమ్మ అమ్మవారి జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. రజక సంఘం ఆధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యుడు రాచమళ్ల శ్రీనివాసరావు, రత్నకుమారి దంపతుల పర్యవేక్షణలో గంగానమ్మకు ఘతం కుండలతో చద్దియ్యాపారం(సద్దన్నం) నిర్వహించారు. ఘతం కుండలతో గ్రామంలో పర్యటించి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమాలల్లో రజక సంఘం అధ్యక్షుడు రాచమళ్ల అంజయ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముగ్గురు పందెంరాయుళ్ల అరెస్ట్

తోట్లవల్లూరు: కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడి జరిపిన ఘటన మండలంలోని గురివిందపల్లిలో ఆదివారం జరిగింది. స్థానిక కృష్ణానది తీరంలో నిర్వహిస్తున్న కోడిపందేలపై దాడి జరిపి ముగ్గురు పందెం రాయుళ్లను, ఒక కోడి పుంజు, రూ.850 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి.విశ్వనాథ్ తెలిపారు.

సుబ్బారాయుడి ఆలయంలో కోలాహలం



మోపిదేవి: రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన భక్తజనంతో మోపిదేవిలో వేంచేసియున్న వల్లీదేవసేన సుమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం కోలాహలంగా మారింది. ఏడాది చివరి ఆదివారం సెలవుదినం కావడంతో పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తెల్లవారుజాము నుంచే క్యూలైలన్నీ నిండిపోయాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆర్థిక సాయం

కలిదిండి: అనారోగ్యంతో బాధపడుతున్న మద్దవానిగూడెంకు చెందిన నేతల వసంతకు కలిదిండి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో రూ.6 వేలు ఆర్థిక సహాయం చేశారు. గుర్వాయపాలెం లక్ష్మి ఆలయంలో కలిదిండి మానవతా సంస్థ నెలవారీ సమావేశం ఆదివారం నిర్వహించారు. సేవా సంస్థ అధ్యక్షుడు, గుర్వాయపాలెం ఎంపీటీసీ గోదావరి సత్యనారాయణ రూ.5 వేలు, మూలలంక సర్పంచ్ మహాదేవ విజయబాబు రూ.1000 నేతల వసంతకు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు మారుబోయిన రత్నారావు, చక్కా జగన్, పత్తి శ్రీను, పోసిన కొండా, సింగవరపు లారెన్స్, మావులూరి బాబురావు, నల్లూరి నరసింహారావు, కమతం సుబ్బయ్య, కలిదిండి ఆంజనేయులు, బూర్ల వెంకటేశ్వరావు పాల్గొన్నారు.











లాయర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



గుడివాడలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జస్టిస్ దేవానంద్

గుడివాడ టౌన్: కృష్ణా జిల్లా, గుడివాడలో ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ 2024 క్యాలెండర్ ఆదివారం ఆవిష్కరించారు. మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ చేతుల మీదుగా ఈ క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో జస్టిస్ దేవానంద్ మాట్లాడుతూ.. న్యాయవాదులు తమ వృత్తికే పరిమితం కాకుండా భవిష్యత్ తరాలకు ఉపయోగపడే అంశాలపై కూడా దృష్టి పెట్టాలన్నారు. విద్య, వైద్య రంగాల్లో సైతం న్యాయవాదుల ప్రమేయం ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.శాంతికుమార్, రాష్ట్ర కమిటీ సభ్యుడు గంటా సురేష్ బాబు, సభ్యులు అనుమల బ్రహ్మేశ్వరరావు, కంచర్ల కోటేశ్వరరావు, జాల సంజీవ్, మాణిక్యాలరావు, రవికుమార్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు డేవిడ్‌రాజు, మచిలీపట్నం, మైలవరం, ఉయ్యూరు న్యాయవాదులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

మండవల్లి: నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని మండవల్లి ఎస్‌ఐ సీహెచ్ ఎస్ రామచంద్రరావు పేర్కొన్నారు. సోమవారం నూతన సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాలతో నూతన సంవత్సరం వేడుకలు నిర్వహించుకోవాలన్నారు. జూదం, కోడిపందేలు నిర్వహించరాదని హెచ్చరించారు. ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా ధనుర్మాసం పూజలు



పామర్రు: ధనుర్మాసం ఈ ఏడాది చివరి రోజు ఆదివారం పురస్కరించుకుని పలు వైష్ణవ ఆలయాలలో ధనుర్మాసం పూజలను వైభవంగా నిర్వహించారు. పామర్రులోని విష్ణాలయంలో గోదాదేవి రంగనాథ స్వామివార్లకు విశేషంగా అభిషేకాలను చేసి పంచామృతాలతో నవరసాలతో స్నపనలు నిర్వహించారు. అనంతరం స్వామికి శత సహస్ర నామాలతో ప్రత్యేకంగా పూజలు చేశారు. మండల పరిధిలోని జమీదగ్గుమిల్లి గ్రామంలోని శ్రీ సీతా రామాంజనేయస్వామి ఆలయంలో గోదాదేవి రంగనాథ స్వాముల చిత్ర పటాలకు, విగ్రహాలకు విశేషంగా పూజలు చేశారు. నిమ్మకూరు, పెరిశేపల్లి తదితర గ్రామాల్లో ధనుర్మాస పూజలు ఘనంగా నిర్వహించారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ





ఎన్జీఓస్ అసోసియేషన్, జయలక్ష్మి ఇంజనీరింగ్ వర్క్స్ క్యాలెండర్లను ఎమ్మెల్యే కొడాలి నాని ఆవిష్కరించారు. ఎన్టీఆర్ స్టేడియం 2024 డైరీని ఎమ్మెల్యే నాని, బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి ఆవిష్కరించారు. -గుడివాడ టౌన్

నేడు ఎమ్మెల్యే కార్యాలయంలో వేడుకలు

పామర్రు: పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు నూతన సంవత్సర వేడుకలు జరుగుతాయని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది ఆదివారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఉదయం 11 గంటల నుంచి నియోజకవర్గ ప్రజలు అందరికీ కార్యాలయంలో ఎమ్మెల్యే అందుబాటులో ఉంటారని తెలిపారు.

ముగ్గురు పందెంరాయుళ్ల అరెస్ట్

తోట్లవల్లూరు: కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడి జరిపిన ఘటన మండలంలోని గురివిందపల్లిలో ఆదివారం జరిగింది. స్థానిక కృష్ణానది తీరంలో నిర్వహిస్తున్న కోడిపందేలపై దాడి జరిపి ముగ్గురు పందెం రాయుళ్లను, ఒక కోడి పుంజు, రూ.850 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పి.విశ్వనాథ్ తెలిపారు. కోడిపందేల సమాచారం ఇవ్వాలని ప్రజలను ఆయన కోరారు.
























అగ్నిప్రమాద బాధితులకు పరామర్శ



మచిలీపట్నంటౌన్: నగరంలోని 32వ డివిజన్ చింతగుంట పాలెం మంచినీటి కాలువ సమీపంలో అగ్నిప్రమాద బాధితులను వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఆదివారం పరామర్శించారు. ఆ ప్రాంతానికి చెందిన పుట్టి బాబూరావు పూరిల్లు ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదానికి గురై పూర్తిగా ఆహుతైంది. విషయం తెలుసుకున్న పేర్ని కిట్టు బాధితులను పరామర్శించారు. పేర్ని కిట్టుతో పాటు ఆ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్చార్జ్ చింతా మౌనిక, పార్టీ నాయకులు బాబూరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.





వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుల నియామకం


భట్రాజు శివాజీ


తిరుమాని రమేష్


గుమ్మడి వెంకటేశ్వరరావు


మోట్రూ ఏసుబాబు

కైకలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలతో తాడేపల్లి పార్టీ కార్యాలయం నుంచి కైకలూరు నియోజకవర్గ నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులను నియమిస్తూ ఉత్తర్వులు అందాయి. ప్రస్తుతం పనిచేస్తున్న అధ్యక్షులనే కొనసాగించే విధంగా వారికే బాధ్యతలు అప్పగించారు. కైకలూరు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా భట్రాజు శివాజీ, ఉపాధ్యక్షులుగా ఘంటసాల శేషారావు, ఈదా పండుబాబు, కలిదిండి మండల అధ్యక్షుడిగా తిరుమాని రమేష్, ఉపాధ్యక్షులుగా గద్దె ఆనందకుమార్, నామాని సత్యనారాయణ, మండవల్లి మండల అధ్యక్షుడిగా గుమ్మడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా చంద్రాల సూర్యనారాయణ, కురేళ్ళ మరియమ్మ, ముదినేపల్లి మండల పార్టీ అధ్యక్షుడిగా మోట్రూ ఏసుబాబు, ఉపాధ్యాక్షులుగా అబ్బిశెట్టి వెంకటేశ్వరరావు, మరీదు హనుమంతరావుతోపాటు జనరల్ సెక్రటరీ, ట్రెజరర్, సెక్రటరీ, ఎగ్జిక్యూటివ్ మెంబరు వంటి ఒక్కో కమిటీలో 27 మంది సభ్యులతో జాబితాలను విడుదల చేశారు. పలువురు పార్టీ నేతలు నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

ఘనంగా పైడమ్మ జాతర మహోత్సవాలు



పెడన: పట్టణంలో వేంచేసి ఉన్న పైడమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. భక్తులు భక్తిశ్రద్ధలతో శిడిబండ్లను కట్టి పసుపు, గులామ్‌లు జల్లుకుంటూ కేరింతలు కొడుతూ నృత్యాలు చేస్తూ ఆలయానికి చేరుకుని మొక్కుబడులు తీర్చుకుంటున్నారు. ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు దర్శనం కల్పించడంతో భక్తులు బారులు తీరారు. ఉదయం ఆరు నుంచి పది వరకు ఉచిత దర్శనం, ఉదయం పది గంటల తరువాత టికెట్ రూ.10, రూ.25 కేటాయించడంతో భక్తులు ఆయా లైన్లలో క్యూ కట్టారు. ఆలయ కమిటీ వారితో పాటు దేవదాయశాఖ ఈవో మోహనరావు తదితరులు పర్యవేక్షించారు. పెడన మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, ప్రసాద్ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. శిడిబండ్ల హడావుడి అధికం కావడంతో పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సీఐ హాబీబ్‌బాషా ఆధ్వర్యంలో ఎస్‌ఐ-1, 2లు రవిచంద్రకుమార్, హనుమంతరావు ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఆలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

నూతన సంవత్సర సందడి

కైకలూరు/తోట్లవల్లూరు/పామర్రు: నూతన సంవత్సరం వేడుకలు నిర్వహించుకునేందుకు పామర్రు, గుడివాడ, కైకలూరు నియోజకవర్గాల్లో ప్రజలు సిద్ధమయ్యారు. సోమవారం ఉదయం ప్రముఖులకు బొకేలు, పండ్లు అందజేసేందుకు, గృహాల ముందు రంగు రంగుల ముగ్గులు వేసేందుకు అవసరమైన పూలు, పండ్లు, రంగులు కొనుగోలు చేసేందుకు మార్కెట్‌కు తరలివచ్చారు. ప్రధాన రహదార్ల వెంబడి ఏర్పాటు చేసిన దుకాణాలకు వచ్చి వీటిని కొనుగోలు చేశారు. దుకాణాలు కొనుగోలుదారులతో కిక్కిరిశాయి. బిర్యానీలు, కేక్‌లు, స్వీట్లు అమ్మకాలు సాగించేందుకు వ్యాపారులు ప్రధాన రహదారి వెంబడి ప్రత్యేక టెంట్లు వేశారు. రంగు రంగుల ముగ్గులతో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మహిళలు తమ గృహాల ముందు ముగ్గులు వేశారు. 12 గంటల వరకు మేల్కొన్న యువత డేట్ మారగానే హ్యాపీ న్యూ ఇయర్ అంటూ కేరింతలు కొట్టారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గ్రామాల్లో పలు సెంటర్లలో పిల్లలు, పెద్దలు న్యూ ఇయర్‌కు స్వాగతం పలుకుతూ కేక్‌లు కట్ చేసి సందడి చేశారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలయాల్లో పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యేల కార్యాలయాలు, ఎమ్మెల్సీ కార్యాలయం వద్ద నూతన సంవత్సర సందడి నెలకొంది.


తోట్లవల్లూరులో స్వీట్ షాపు వద్ద కొనుగోలుదారుల సందడి


పామర్రు సెంటర్‌లో పూల దుకాణం వద్ద ప్రజలు


కైకలూరులో ముగ్గుల కోసం రంగుల విక్రయం

కనులపండువగా అయ్యప్ప పడిపూజ

కోడూరు: మండలంలోని లింగారెడ్డిపాలెం గ్రామంలో అయ్యప్ప పడిపూజను శనివారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. గ్రామానికి చెందిన బచ్చు వెంకటపున్నయ్య, రమణ కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో పడిపూజను నిర్వహించారు. అయ్యప్ప దేవాలయ ప్రధానార్చకుడు కోమ్మూరి శ్రీనివాసశర్మ మంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు చేసి పడిహారతిని వెలిగించారు. అరటిదొన్నెలతో చేసిన గణపతి, అయ్యప్ప, కుమారస్వామి మందిరాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మోర్తోటకు చెందిన గౌరీశంకర్ గురుస్వామి బృందం ఆలపించిన అయ్యప్ప సంకీర్తనలు అలరించాయి.


బంటుమిల్లి రామాలయంలో అయ్యప్ప పడిపూజ చేస్తున్న భక్తులు

అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో..

బంటుమిల్లి: స్థానిక రామాలయంలో ఆదివారం అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ వైభవంగా నిర్వహించారు. కైకలూరుకు చెందిన గురుస్వామి హరిబోల్ స్వామివారి పూజలు నిర్వహించారు. స్థానిక గురుస్వామి, అన్నదాన శిబిరం నిర్వాహకులు కొల్లా రాంబాబు గురుస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పడిపూజలో గాంధీనగర్‌కు చెందిన భజన బృందం ఆలపించిన భక్తి పాటలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ పూజ కార్యక్రమంలో బంటుమల్లి, కృత్తివెన్ను మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన అయ్యప్పలు, భవానీలు పాల్గొన్నారు.



అక్రమ మద్యం పట్టివేత

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాలలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు ఎస్‌ఐ కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద జరిగిన కార్యక్రమంలో మద్యం వివరాలు వెల్లడించారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు ఘంటసాలలో దాడిచేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వారి వద్ద నుంచి రూ.16,070 విలువగల 115 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. ఎవరన్నా నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చల్లపల్లి సీఐ సీహెచ్ నాగప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా అక్రమ మద్యంను పట్టుకున్న ఎస్‌ఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ పద్మారావు, పలువురు కానిస్టేబుల్స్‌ని సీఐ అభినందించారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు..

పెదకళ్లేపల్లి(మోపిదేవి): అక్రమంగా మద్యం విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ కేవీవీ సత్యనారాయణ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో చల్లపల్లి సీఐ నాగప్రసాద్ పర్యవేక్షణలో ఎస్‌ఐ సత్యనారాయణ తమ పోలీస్ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేసి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని పట్టుకున్నారు. మండల పరిధిలో పెదకళ్లేపల్లి, వెంకటాపురం గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 3,940లు విలువైన 28 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు.

30 యాక్ట్ అమలు..

నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని 30 పోలీస్ యాక్ట్ నిబంధనలు అమల్లో ఉన్నట్లు మోపిదేవి ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. పట్టణ, ముఖ్య ప్రాంతాల్లో అర్ధరాత్రి 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, వేడుకలను ప్రజలందరూ శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు.

చదువుతో విజ్ఞానం, సంస్కారం



పెనమలూరు: విద్యార్థులు చదువుకుంటే విజ్ఞానంతో పాటు సంస్కారం కూడా వస్తుందని మంగళగిరి డీజీపీ కార్యాలయం ఐపీఎస్ అధికారి ఎం.రవీంద్రనాథ్‌బాబు అన్నారు. కానూరు సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాల 33వ వార్షికోత్సవంలో ఆయన శనివారం రాత్రి పాల్గొన్నారు. రవీంద్రనాథ్‌బాబు మాట్లాడుతూ పిల్లల లక్ష్యం ఏమిటో తల్లితండ్రులు తెలుసుకోవాలని వారికి ఏరంగంలో ఆసక్తి ఉందో అందులో ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, పాఠశాల కన్వీనర్ వీరపనేని శశికళ, సిద్ధార్థ అకాడమీ సంయుక్త కార్యదర్శి నిమ్మగడ్డ లలిత ప్రసాద్, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధి కాకాని తరుణ్, ప్రిన్సిపాల్ మనోజ్‌కర్మాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇస్త్రీ బండి అందజేత



రామవరప్పాడు: స్వయం ఉపాధి కోసం వైఎస్ఆర్ చారిటీస్ ట్రస్ట్ చైర్మన్ యలమంచలి జయప్రకాష్ ఆదివారం ఎనికేపాడులో ఇస్త్రీ బండి అందజేశారు. గ్రామంలో నివాసం ఉంటున్న అప్పారావు, కల్పన దంపతులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు తెలుసుకుని ఇస్త్రీ బండి అందజేశారు. జయప్రకాష్ మాట్లాడుతూ పలు నియోజకవర్గాల్లో వైఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యలమంచలి సామ్రాజ్యం, వెల్లంకి రాజా, మధు, బొప్పన శ్రీనివాస్, యలమంచలి భీముడు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కానూరులో వృద్ధుడు అదృశ్యం

పెనమలూరు: కానూరులో వృద్ధుడు అదృశ్యం అవ్వడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టి.రామారావు తెలిపిన వివరాల ప్రకారం కానూరు సనత్‌నగర్ రామాలయం వీధిలో కర్రి పద్మావతి భర్త వేణు గోపాలరావు(60)తో ఉంటుంది. భర్త కార్పెంటర్ పనులు చేస్తాడు. కాగా అక్టోబర్ నెలలో భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అతనికి బయట పనులు ఉంటే పనికి వెళ్లి 15 రోజుల వరకు తిరిగిరాడు. దీంతో భర్త పని ముగించుకుని ఇంటికి వస్తాడని భార్య పద్మావతి అనుకుంది. అయితే భర్త రాకపోవడంతో అతనికి ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తుంది. దీంతో పద్మావతి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.





